పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 97. అల్ ఖద్ర్ సూరా పరిచయం

మక్కాలో అవతరణ. ఇందులో 5 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరాను అవతరింపజేయటంలోని ఉద్దేశ్యం, ప్రజలకు ఖుర్‌ఆన్ పట్ల విలువా గౌరవాలు, మరియు ప్రాముఖ్యతను తెలియపర్చడమే. ఖుర్‌ఆన్‌లోని వరుసక్రమంలో సూరయె అలఖ్ తర్వాత ఈ సూరాను ఉంచడం ద్వారా తెలిసే విషయం ఏ పవిత్ర గ్రంథం అవతరణ అయితే అలఖ్ సూరాలోని మొదటి 5 ఆయత్‌లతో ప్రారంభమయ్యిందో, దాని గురించే ఈ సూరాలో అది ఎటువంటి విలువయిన రాత్రి అదృష్టాన్ని తీర్చిదిద్దే రాత్రిలో అవతరించబడిందో ఎటువంటి ఉన్నత గౌరవం గల గ్రంథమో ప్రజలకు తెలియచేయబడింది.

అల్లాహ్ సెలవిచ్చాడు. మేము ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాము. అంటే ఇది ఏ మానవుడి చేతనో వ్రాయబడిన గ్రంథం కాదు. దైవం చేత అవతరింపజేయబడిన గ్రంథం. మరో విషయం : ఇది లయ్‌లతుల్ ఖద్ర్ అంటే విలువయిన రాత్రిలో అవతరింపజేయబడింది. (షబెఖద్ర్) అంటే జాతకాలు మారే రాత్రి. శుభాలతో కూడిన రాత్రి. ఖుర్‌ఆన్ అవతరించిన రాత్రి అంటే అది మామూలు రాత్రి కాదు. అది అదృష్టాలను మార్చివేసే రాత్రి. ఈ రాత్రిన ఖుర్‌ఆన్ అవతరించడం అంటే కేవలం ఒక గ్రంథం అవతరించడం కాదు. పైగా అది కేవలం ఖురైష్‌లను మాత్రమో, కేవలం అరబ్బులను మాత్రమే కాక ప్రపంచ జాతకాన్నే మార్చిపారేస్తుంది. ఈ విషయమే సూరా దుఖాన్‌లో చెప్పబడింది.

ఆ వివరమైన గ్రంథం సాక్షి! నిస్సందేహంగా మేము దీన్ని శుభాలతో కూడిన రాత్రిలో అవతరింపజేశాము. నిస్సందేహంగా మేము హెచ్చరించేవారము. ఈ రాత్రిలోనే ప్రతి దృఢమైన పని గురించి నిర్ణయించబడుతుంది. ఇక్కడే అదృష్టాల నిర్ణయం జరుగుతుంది. ఇక్కడే నష్టం, లాభం, ఆరోగ్యం, పేదరికం, సంపన్నతల నిర్ణయాల తీర్పులు ఈ రాత్రినే జరుగుతాయి. మా ఆజ్ఞతోనే ఈ తీర్పులు జరుగుతాయి. మేమే ప్రవక్తలనుగా చేసి, దూతలను పంపిస్తాము. ఖుర్‌ఆన్ నీ ప్రభువు ద్వారా పంపబడిన కారుణ్యం. వినేవాడు, ఎరిగినవాడు ఆయనే. (సూరయె దుఖాన్ : 1 – 6)

## 97. అల్ ఖద్ర్

**ఆయత్‌లు : 5** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) మేము ఖుర్‌ఆన్‌ను ఘనమైన రాత్రిలో అవతరింపజేశాము. (2) ఆ ఘనమైన రాత్రి ఏదో నీకు ఏం తెలుసు? (3) ఘనమైన రాత్రి వెయ్యి నెలలకంటే ఉత్తమమయినది.

آيَاتُهَا 5 ﴿سُورَةُ الْقَدْرِ مَكِّيَّةٌ 97﴾ رُكُوعُهَا 1

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

إِنَّا أَنزَلْنَاهُ فِي لَيْلَةِ الْقَدْرِ ﴿1﴾
وَمَا أَدْرَاكَ مَا لَيْلَةُ الْقَدْرِ ﴿2﴾
لَيْلَةُ الْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ﴿3﴾

| | |
|---|---|
| (4) ఇందులో జిబ్రయీల్ మరియు దూతలు తమ ప్రభువు అనుమతితో తఖ్‌దీర్ (అదృష్టం) నిర్ణయాలు తీసుకొని దిగివస్తారు. (5) ఈ రాత్రి ఉదయం వరకు శుభకరమైనది. | تَنَزَّلُ الْمَلٰٓئِكَةُ وَالرُّوْحُ فِيْهَا بِاِذْنِ رَبِّهِمْ ۚ مِنْ كُلِّ اَمْرٍ ۛ ﴿4﴾<br>سَلٰمٌ ۛ هِيَ حَتّٰى مَطْلَعِ الْفَجْرِ ۧ ﴿5﴾ ع 1 5 22 |

1 – 5 వాక్యాలు

లయ్‌లతుల్ ఖద్ర్ రమజాన్ మాసంలో ఆఖరి దశకంలోని బేసి రాత్రులలో ఏదో ఒక బేసి రాత్రి అని ప్రామాణిక హదీసుల ద్వారా రుజువు చెయ్యబడింది. దీన్ని గోప్యంగా ఉంచడంలో మర్మం, ప్రజలు ఐదు బేసి రాత్రులలో ఆరాధన చేసి లయ్‌లతుల్ ఖద్ర్‌ని అన్వేషించాలి అన్నదే.

లయ్‌లతుల్ ఖద్ర్ విశిష్ఠత ఏమంటే లయ్‌లతుల్ ఖద్ర్ ఒక్క రాత్రి చేసిన ఆరాధన వెయ్యి నెలల్లో చేసిన ఆరాధన కంటే ఉత్తమమయినది. ఎవరైనా వెయ్యి మాసాలపాటు రాత్రిళ్ళు ఆరాధన, పగలు ఉపవాసంలో పాల్గొనడం వల్ల లభించే పుణ్యం కన్నా ఎక్కువ పుణ్యం. కేవలం ఒక్క రాత్రి అంటే లయ్‌లతుల్ ఖద్ర్ రాత్రిని పొందితే లభిస్తుంది. వెయ్యి మాసాలు అంటే 83 సంవత్సరాల 4 నెలలు. ఉమ్మతె ముహమ్మదియా (ముహమ్మద్ (స) అనుచర సమాజం)పై అల్లాహ్ చేసిన మహోపకారం. ఐదు బేసి రాత్రులలో ఆరాధన చేసినట్లయితే 83 సంవత్సరాల 4 నెలల ఆరాధన యొక్క పుణ్యం లభిస్తుంది.

లయ్‌లతుల్ ఖద్ర్‌లో జిబ్రయీల్ (అ) దూతలతో భూప్రపంచానికి వస్తారు. ఒక సంవత్సర కాలం కోసం అల్లాహ్ నిర్ణయించిన పనులు నిర్వర్తించడానికి వస్తారు. విశ్వాసులు ఆ రాత్రి షైతాను కీడు నుండి సురక్షితంగా ఉంటారు. లేక దైవదూతలు విశ్వాసులకు సలామ్ చేస్తారు లేక దూతలే పరస్పరం సలామ్ చేసుకుంటారు. షబెఖద్ర్ కోసం మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రత్యేకించి ఈ దుఆ నేర్పారు, "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫఅఫ్‌అన్నీ" (సునన్ తిర్మిజీ – హ.నెం.3513) అందువలన షబెఖద్ర్‌లో ఈ దుఆ విరివిగా చేయాలి.

ఖుర్‌ఆన్ అల్లాహ్ గ్రంథం. ఖుర్‌ఆన్ అల్లాహ్ కారుణ్యం. ఖుర్‌ఆన్ అదృష్టాన్ని మార్చివేసే గ్రంథం. ఒక జాతి ఖుర్‌ఆన్ చూపిన సూత్రాలను అనుసరిస్తే ఆ జాతి అదృష్టం మారిపోతుంది. అది బలహీనంగా ఉంటే, శక్తిమంతంగా రూపొందుతుంది. అది పరాభవం పాలు అయినదయితే గౌరవం కలదయిపోతుంది. అజ్ఞానంలో ఉంటే, విజ్ఞాన వంతం అయిపోతుంది. అది పేదరికంలో ఉండి ఉంటే, సుసంపన్నం అయిపోతుంది. దారి తప్పినదయితే అది సన్మార్గం పొందగలుగుతుంది. ఖుర్‌ఆన్ బహు గొప్ప గ్రంథం. అది అవతరించిన రాత్రి లయ్‌లతుల్ ఖద్ర్ అయింది. ఏ నెలలో అది అవతరించబడితే ఆ నెల పవిత్ర రమజాన్ మాసం అయిపోతుంది. ఏ ప్రవక్తపై అవతరించబడిందో ఆయన ప్రవక్తలందరికీ నాయకుడయ్యారు. ఏ ఉమ్మత్‌పై అవతరింపజేయబడిందో అది అత్యుత్తమ ఉమ్మత్ అయింది. ఖుర్‌ఆన్ దైవకారుణ్యాల ఖజానా. విశ్వాసం, హితబోధల సాగరం, మనిషి ఎప్పుడు ఖుర్‌ఆన్‌ను పఠించినా "అవూజు బిల్లాహి మినష్షయ్‌తా నిర్రజీమ్" పఠిస్తాడు. దానివల్ల షైతాను దూరంగా పారిపోతాడు.

ఇప్పుడు మనం ఉన్నాం. ఖుర్‌ఆన్ ఉంది. ఈ ఖజానా నుండి, రత్నాలు, మాణిక్యాలు, వెండీ బంగారాలు ఎవరికెంత కావాలో తీసుకోవచ్చు. అడ్డగించే వారే లేరు. వ్యతిరేకి ఎవరూ లేరు. శత్రువు ఎవరూ లేరు. ఈనాడు ప్రజలు హితబోధకు దూరంగా ఉన్నారు. అంటే ఖుర్‌ఆన్‌కు దూరంగా ఉండటం వల్లనే. ఖుర్‌ఆన్‌ను వినరు అర్థం చేసుకోరు. ఖుర్‌ఆన్ చదవరు. ఖుర్‌ఆన్ హితబోధల సాగరం. ఎలాగయినా ఇక్కడ మీకు హితబోధ లభిస్తుంది. ఖుర్‌ఆన్ తప్ప ఇతర గ్రంథాల విషయం అలా కాదు.